క్లుప్తంగా

'కొండా'పై చర్య తీసుకోవాలి


పీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు

పరకాల : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిధర్‌రావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని పరకాల నియోజకవర్గ నాయకులు కోరారు. ఈ మేరకు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని దుర్భషలాడుతూనే మరోవైపు సుస్మిత పటేల్ పరకాల నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులకు అండగా ఉంటున్నారని, పార్టీ కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నారని కొండా మురళి వ్యాఖ్యలు కార్యకర్తలను ఆందోళనకు గురిచేసిందని ఫిర్యాదులో తెలిపారు. పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోని పక్షంలో పరకాలలో పార్టీ క్యాడర్ అయోమయంలో పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



ధర్మసాగర్ : మండలంలోని ముప్పారంలో మురుగు రోడ్డుపైకి చేరి రోడ్డు మొత్తం అధ్వానంగా మారింది. ముప్పారం బస్టాండు నుంచి నారాయణగిరికి వెళ్లే మలుపుల వద్ద వివిధ షాపులు ఏర్పాటు చేశారు. ఈ షాపుల్లో వినియోగించిన మురికి నీరు డ్రైయినేజీలోకి వెళ్లకుండా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా ఏదైనా పెద్ద వాహనం వస్తే మరో వాహనం పక్కకు ఆపుకోవాల్సి వస్తుందని, లేదంటే మురికి నీరు మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఇప్పటికీ చర్య తీసుకోలేదని పలువురు ఆగ్రహిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయా షాప్ నిర్వాహకులపై చర్య తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారంలో సీసీ రోడ్డు మధ్యలో తాగునీటి పైపులైన్ లీకేజీ అవడంతో నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. పంచాయతీ కార్యదర్శి కిరణ్‌ను వివరణ కోరగా.. ఆరు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉందని, పైపులైన్ లీకేజీ కాకుండా మరమ్మతు చేయాలంటే సీసీ రోడ్డు ధ్వంసం చేయాల్సిన వస్తుందని తెలిపారు. అయినా గతంలో మరమ్మతు చేసినప్పటికీ మళ్లీ లీకేజీ అవుతుందని , ఉన్నతాధికారులు తెలుపుతామని అన్నారు.

మహిళను దూషించిన పలువురిపై కేసు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన మహిళను దూషించి, దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రంజిత్ రావు శనివారం ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపాక గ్రామానికి చెందిన చిట్టిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి హనుమకొండ దగ్గర ఆరెపల్లి గ్రామ జంక్షన్‌లోని సాయి ప్లేవుడ్ షాపులో లక్ష 59వేల రూపాయల విలువచేసే ప్లేవుడ్ సామాన్ అరువుపై తీసుకున్నాడు. డబ్బులు అడగడం కోసం షాపు యజమానితో వచ్చిన స్థానికుడు పాపయ్య, కొంత మందితో కలిసి విజయ్‌కుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో విజయ్‌కుమార్‌రెడ్డి భార్య చిట్టిరెడ్డి వాణి ఒంటరిగా ఇంట్లో ఉంది. వాణి అనుమతి లేకుండా వారు ఇంట్లోకి ప్రవేశించి వాణిని దూషిస్తూ దాడి చేసినట్లు తెలిపారు. వాణి ఫిర్యాదు మేరకు పాపయ్యతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ..

నడికూడ : రెండు బైక్‌లు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన మండలంలో కంఠాత్మకూరులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా చిట్యాలకు చెందిన శ్రీనివాస్ తన బైక్‌పై హనుమకొండ నుంచి పరకాలకు వస్తుండగా రామచంద్రచారి దంపతులు బైక్‌పై పరకాల నుంచి హనమకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కంఠాత్మకూరు వాగు వద్ద ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రామచంద్రచారి దంపతులతో పాటు శ్రీనివాస్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

రెండు టిప్పర్ల సీజ్

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలో అనుమతులు లేకుండా మట్టితవ్వకాలు చేపట్టినగా దాడులు నిర్వహించినట్లు తహసీల్దార్ రాజేష్ శనివారం తెలిపారు. రెండు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ముస్తఫాపూర్ గ్రామ శివారులో ఓ కంపెనీకి చెందిన వ్యక్తులు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టినట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. దీంతో దాడు నిర్వహించి రెండు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని అన్నారు.

ప్రహరీ నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

- కేజీబీవీ విద్యార్థినులకు రక్షణ కరువు
- పాఠశాలలో సంచరిస్తున్న విషపురుగులు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని డార్మెటరీ


ప్రహరీ లేకుండా ఉన్న వేలేరులోని కస్తూర్బా గాంధీ విద్యాలయం

వేలేరు : పేద విద్యార్థులతో పాటు చదువు మధ్యలోనే మానేసిన బాలికలు చదువుకు దూరం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు శ్రీకారం చుట్టింది. వేలేరు మండలానికి సంబంధించిన కేజీబీవీ పాఠశాలను సుమారు 4 కిలోమీటర్ల దూరంలోని గొల్లకిష్టంపల్లి వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 250 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల నిర్మించి దాదాపు 5 ఏళ్లు గడుస్తున్నా ప్రహరీ నిర్మించకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కరువైందని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాగే డార్మెటరీ గదుల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు విద్యార్థినులు తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ఖాళీ ప్రదేశం ఎక్కువగా ఉండటంతో విషపురుగులు నిత్యం సంచరిస్తున్నాయని, దీంతో భయాందోళన తప్పడం లేదని అంటున్నారు.

బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు..

మండల కేంద్రం నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాల, గొల్లకిష్టంపల్లి, బంగ్లాపల్లి గ్రామాల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తెలిపారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

విజ్ఞాన్ స్కూల్ పాఠ్యపుస్తకాల గది సీజ్


పాఠ్యపుస్తకాల గదిని సీజ్ చేస్తున్న సీఆర్పీ సుభాష్

కమలాపూర్ : మండలంలోని శనిగరంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న విజ్ఞాన్ స్కూల్ పాఠ్య పుస్తకాల గదిని మండల విద్యా శాఖ అధికారులు శనివారం సీజ్ చేశారు. శనిగరంలో విజ్ఞాన్ స్కూల్ యాజమాన్యం అనుమతులు లేకుండా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో విద్యా శాఖ అధికారులు స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అమ్ముతున్నట్లు గుర్తించారు. వెంటనే పాఠ్య పుస్తకాల గదిని సీజ్ చేసి స్కూల్ నిర్వాహకులకు నోటీస్ జారీ చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. స్కూల్ యాజమాన్యం ఇచ్చే సంజాయిషీని డీఈఓకు పంపిస్తామని, డీఈఓ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు. అనుమతులు లేకుండా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, టై, బెల్టులు, గుర్తింపు కార్డులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎంఈఓ హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురౌతుందని, కాపాడాలని మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ తహసిల్దార్ ప్రభావతికి వినతిపత్రం అందించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం ఇందిరమ్మ గృహ నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం కాట్రపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 302,303లో సుమారు 3.02 ఎకరాల భూమిని 92మంది పేదలుకు కేటాయించి ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో అప్పటి నుంచి భూమికి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత

యోగా సాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీఓ డాక్టర్ నారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు. యోగా ఆసనాలు వేసి ప్రాముఖ్యతను వివరించారు. అలాగే శాయంపేట, కమలాపూర్, నడికూడ, దామెర, ఐనవోలు మండలాల్లోని కస్తూర్బా, ఎంజేపీ, ప్రభుత్వ ప్రాథమికోన్నత, బాలిక పాఠశాలతో పాటు వివిధ జూనియర్ కాలేజీల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా ఆసనాలు వేశారు.

– సాక్షి నెట్‌వర్క్


పరకాల : యోగా దినోత్సవంలో పాల్గొన్న ఎమెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


ఆత్మకూరు : యోగా చేస్తున్న ఉపాధిహామీ కూలీలు


కమలాపూర్‌లో..


ఆత్మకూరులో..


ఐనవోలులో..


పరకాల : జైలులో యోగా చేస్తున్న ఖైదీలు


నడికూడలో..


శాయంపేట : ఎంజేపీలో..


ఎల్కతుర్తి : వంగరలో..

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి అన్నారు. మైలారం, హుస్సేన్‌పల్లి గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్‌బెడ్రూం నిర్మిస్తామని మోసం చేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించారని, ఇప్పుడు మళ్లీ పేదవారికి ఇళ్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుక కోసం గ్రామపంచాయతీ కార్యదర్శి వద్ద టోకెన్లు తీసుకోవాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. నాయకులు కుమార్, రాజ్‌కుమార్, రాజేందర్, రాజు పాల్గొన్నారు.

బీసీఐ రైతులకు అంతర్జాతీయ గుర్తింపు రావాలి

- ప్రజ్వల్ పాలకవర్గ సభ్యురాలు రజిత


టర్కీ దేశంలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న ఎడ్ల రజిత

శాయంపేట : బీసీఐ నియమాలకు అనుగుణంగా పత్తి సాగు చేస్తున్న రైతులకు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు రావాలని ప్రజ్వల్, బీసీఐ పాలకవర్గ సభ్యురాలు ఎడ్ల రజిత అన్నారు. శుక్రవారం టర్కీ దేశంలో జరిగిన ఇంపాక్ట్ ప్యానెల్ ట్రెనింగ్ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుంచి మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం పాలకవర్గ సభ్యురాలు ఎడ్ల రజిత పాల్గొని వివిధ దేశాల ప్రతినిధులతో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాంతంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ వారి ఆర్థిక సహకారంతో బీసీఐ నెల పునరుత్పాదక వ్యవసాయం ప్రాజెక్టు నియమాలకు అనుగుణంగా అమలు చేస్తున్న శాయంపేట ,గీసుగొండ, రేగొండ, పర్వతగిరి మండలాల్లో 15,653 మంది రైతులు ప్రజ్వల్ నిర్వహణలో చేస్తున్నటువంటి కార్యక్రమాలు రైతులకు ఎంతోగాను తోడ్పాటు అందిస్తున్నాయని అన్నారు. రైతులకు అతి తక్కువ ధరలో వరంగల్ సూపర్ గోల్డ్‌ను అందించడంతో పాటు నూతన వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొదిస్తూ నాణ్యమైన పత్తి దిగుబడులు సాధించేందుకు ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆరు సంవత్సరాలుగా కృషి చేస్తోందన్నారు. రైతులు పండించిన పత్తిని విక్రయించేందుకు నేరుగా మార్కెట్ సదుపాయాన్ని కల్పించే విధంగా ప్రజ్వల్ కృషి చేస్తుందన్నారు. బీసీఐ పునరుత్పాదక వ్యవసాయ ప్రాజెక్టు వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మూగజీవాల అపహరణ

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన మందాటి కుమారస్వామికి చెందిన రెండు ఎడ్లను దొంగలించినట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణమోహన్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గోవిందాపూర్ గ్రామానికి చెందిన మందాటి కుమారస్వామి ఈనెల 18వ తేదీన రాత్రి తన ఇంటి దగ్గరలోని పొలంలో రెండు ఎడ్లను కట్టి వేయగా అదే రోజురాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు లక్ష 10వేల ఉంటుందని తెలిపారు. బాధితుడు కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పరామర్శ

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన మడ్లపల్లి జనార్ధన్ మృతిచెందగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్లు శనివారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న రవీందర్‌గౌడ్

ఆత్మకూరు : మండల కేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కంఠమహేశ్వరస్వామి, ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ శనివారం రూ.51వేలు విరాళం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. పొగాకుల కొమురయ్య, గుర్రం ప్రభాకర్, బైగాని రమేశ్, పొగాకుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖబడ్దార్.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

- కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్ : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, కాంగ్రెస్ పార్టీ, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలపై నిరాధార ఆరోపణలు చేస్తే ముల్యం చెల్లించక తప్పదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మండలంలోని గుండేడులో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, గుండేడు క్వారీ యజమాని కట్ట మనోజ్‌రెడ్డి మధ్య తలెత్తిన వివాదంలో కౌశిక్‌రెడ్డిపై పోలస్‌లు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీంతో దుబాయ్‌కి పారిపోతున్న కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేశారని ఆరోపించారు. పోలీసులు అరెస్ట్ చేసిన సమయంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, కడియం శ్రీహరి బినామీ మనోజ్‌రెడ్డి అని కౌశిక్‌రెడ్డి మాట్లాడడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీకి, మనోజ్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని, కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు నాగరాజు, శ్రీహరిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పబ్లిసిటీ కోసమే అర్థంపర్థం లేకుండా నిత్యం ఏదో ఒకటి మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే మనోజ్‌రెడ్డికి క్వారీ అనుమతులు ఇచ్చారని, ఇప్పుడు మనోజ్‌రెడ్డి ఎలా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలకు బినామీ అవుతాడని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు పోడేటి భిక్షపతి, విష్ణుదాసు వంశీధర్‌రావు, నాంపెల్లి ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

- ప్రిన్సిపాల్ కోటేష్


కరపత్రాలతో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

శాయంపేట : ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్యాబోధన అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోటేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని శనివారం వారంతపు సంత(అంగడి)లో కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి అధ్యాపకులు, ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్ కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలకు పంపించి పోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలంగాణ మార్గదర్శకుడు జయశంకర్


ఎల్కతుర్తి : ముల్కనూరులో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


కమలాపూర్‌లో..


శాయంపేట : నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి : తెలంగాణ మార్గదర్శకుడు, ఉద్యమానికి స్ఫూర్తిప్రధాత ఆచార్య జయశంకర్ సార్ అని ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా శనివారం ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు గ్రామంలో గల ప్రజా గ్రంథాలయం సమీపంలో ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో ప్రొఫెసర్ జయశంకర్ సార్ పాత్ర మరువలేనిదని కొనియాడారు.

కమలాపూర్ : తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయమని పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఆచార్య జయశంకర్ వర్ధంతిని నిర్వహింఆచరు. సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ ఫోరం నాయకులు సంపత్, రమేశ్, శోభన్, శ్రీనివాస్, అరవింద్, వీరన్న, వెంకటేశ్వర్లు, చందర్ సింగ్ యాదవ్, ఉద్యమకారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : జయశంకర్ స్వగ్రామం మండలంలోని అక్కంపేట గ్రామంలో శనివారం జయశంకర్ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కృష్ణంరాజు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, మాజీ సర్పంచ్ విజయ, భిక్షపతి, రవీందర్ పాల్గొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న అనంతరామ్‌నాయక్

శాయంపేట : తపాలా శాఖ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని పరకాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ (ఏఎస్‌పీ) జాటోతు అనంతరామ్ నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శాయంపేట పోస్టాఫీస్ ఆధ్వర్యంలో శనివారం తపాలా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలు ఎస్‌బీ, ఆర్‌డీ, ఎస్ఎస్ఏ, టీడీని వినియోగించుకోవాలని సూచించారు. ఇన్సూరెన్స్ పథకాలైన ఆర్‌పీఎల్1, పీఎల్1, ఐపీపీబీ ద్వారా అందించే జీఏజీ జనరల్ ఇన్సూరెన్స్ కేవలం రూ.555, రూ.755 రూ. 10లక్షలు, రూ. 15లక్షలు ప్రమాద భీమా వర్తిస్తుందని తెలిపారు. మండలంలోని 15 గ్రామాల్లో పోస్టాఫీస్ ఆధ్వర్యంలో మినీ ఏటీఎంలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఇన్సూరెన్స్ పథకాలైన పీఎంఎస్‌బీవై, పీఎమ్‌జేజేబీవై రూ. 20కే రూ.2లక్షల వరకు బీమా వర్తిస్తుందని అన్నారు. ఈ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాయంపేట ఎస్‌పీఎమ్ రవికుమార్, పోస్టాఫీస్ బీపీఎంలు, ఏబీపీఎమ్‌లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషిచేయాలి


అవగాహన సదస్సులో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

ఐనవోలు : ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని మున్సిపల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ అన్నారు. మండలంలోని 44వ డివిజన్ సింగారం, జోగయ్యపల్లి గ్రామాల్లో తడి, పొడిచెత్త, ప్రమాదకర చెత్త, ప్లాస్టిక్ నిషేధంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీలో కమిటీ సభ్యులు పాల్గొని ప్రతిజ్ఞ చేయడంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి మంచిదికాదని అన్నారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. విద్యార్థులు, యువకులు సైతం ప్లాస్టిక్ వలన జరిగే నష్టంపై గ్రామాల్లో ప్రచారం చేపట్టి చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, జవాన్లు, వర్కర్స్ పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారుల తీరు మార్చుకోవాలి

ధర్మసాగర్ : రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న వివిధ బ్యాంక్ అధికారులపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. రైతు భరోసా నిధులను డ్రా చేసుకునే వీలు లేకుండా ఇతర రుణాల బాకీలకు ము డిపెట్టడం స రి కా దన్నారు.